క్లుప్తంగా

బీవీఆర్ కుటుంబ సభ్యులకు పరామర్శ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇటీవలి కాలంలో మృతిచెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొర్రా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను ఎక్సైజ్, గనులు భూగర్భ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్‌కుమార్ మీనా ఆదివారం పరామర్శించారు. కొండపల్లిలో బీవీఆర్ కుమారుడు, డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ ఇంటికి చేరుకున్న ముకేష్ కుమార్ మీనా బొర్రా వెంకటేశ్వరరావు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పలువురు నాయకులు పల్గొన్నారు.

కల్యాణ మండపానికి రూ.51 వేల విరాళం



మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు శేషాచల శ్రీనివాసస్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణానికి భక్తుడు రూ.51 వేలు విరాళంగా అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణానికి చెందిన దివంగత నాగుబండి రంగయ్య, లక్ష్మీకాంతం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు భిక్షం, వెంకటేశ్వరరావు, కిరణ్ ఈ మొత్తాన్ని వారి బంధువు పొట్టి పున్నయ్య ద్వారా ఆలయ గౌరవ సలహాదారు కోట నాగేశ్వరరావు (బాబు), అర్చకులు శ్యామసుందరాచార్యులకు అందజేశారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



తిరువూరు: ప్రతి రోజూ వ్యాయామం చేస్తే గుండె జబ్బులు, ఇతర వ్యాధులు రావని తిరువూరు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ తాళ్లూరి రామకోటేశ్వరరావు అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో తిరువూరు బోస్ సెంటర్ నుంచి రాజుపేట వరకు 2కే వాక్ నిర్వహించారు. రామకోటేశ్వరరావు మాట్లాడుతూ పీచు పదార్థాలు ఎక్కువగా తినడం, వ్యాయామం చేయడం, ఒత్తిడి తగ్గించుకోవడం, తగిన సమయంలో ఆహారం తిని, విశ్రాంతి తీసుకోవడం వలన గుండె జబ్బులు రావన్నారు. మధుమేహం, రక్తపోటు అదుపులో ఉంచుకుంటే చాలావరకు వ్యాధుల బారిన పడే అవకాశం ఉండదని చెప్పారు. క్లబ్ సభ్యులు కిలారు శివరామకృష్ణ, దోసపాటి రవి, పసుమర్తి వెంకటేశ్వరరావు, తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం గుండె జబ్బులపై జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ శివప్రసాద్ పలు సూచనలిచ్చారు.

160 మందికి దుప్పట్ల పంపిణీ



జి.కొండూరు: మండల పరిధి వెల్లటూరులో పారిశుద్ధ్య కార్మికులు, వరద బాధితులు 160 మందికి గ్రామానికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు పగడాల పెద్ద సాంబయ్య ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. వరద బాధితులకు సాయం చేసేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన కోరారు.

3 నుంచి ఉచిత శిక్షణ

తిరువూరు: విజయ దశమి సెలవుల సందర్భంగా తిరువూరు గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి విద్యార్థులకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇస్తామని గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. చిత్రలేఖనం, యోగా, చదరంగం, వ్యాయామ విద్య, జనరల్ నాలెడ్జ్‌లలో ప్రతి రోజు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కథలు చెప్పడం, క్యారమ్స్, చదరంగం క్రీడల్లో కూడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో నూతన విద్యుత్ లైన్ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ. సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూపేట, సమతానగర్, బస్టాండ్ సెంటర్, పండ్లకొట్టు సెంటర్ ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

- ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రావణి కనక కుమారి
- నూజివీడులో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ



నూజివీడులోని యానాదుల కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

నూజివీడు: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను పారదోలవచ్చని ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రావణి కనక కుమారి అన్నారు. ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-3, యూనిట్-7 ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై ట్రిపుల్‌ఐటీ నుంచి యనాదుల కాలనీ వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. యానాదుల కాలనీలోని యూపీ స్కూల్ పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు ప్లాస్టిక్ వాడకాన్ని మానివేయాలన్నారు. ముఖ్యంగా ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ వల్ల దీర్ఘకాలంలో అనేక దుష్ఫలితాలు సంభవిస్తాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, దీనికి గాను అందరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వాతావరణంలోకి కాలుష్య కారకాలను సాధ్యమైనంత తక్కువ వదిలేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు బొత్స శ్రీనివాసరావు, జాజుల మధు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పీటీ కొత్తూరులో స్వచ్ఛతా హీ సేవ

తిరువూరు: తిరువూరు శివారు పీటీకొత్తూరులో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నగర పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 12వ వార్డులోని దేవసముద్రం పరిసరాలను వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది శుభ్రంచేసి పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త సేకరణ, బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేయకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్ గుమ్మా వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు మేకా ప్రతాప్ అప్పారావు పూజలు



నూజివీడు: స్థానిక ఎమ్మార్ అప్పారావు కాలనీలోని కనకదుర్గమ్మ, గంగానమ్మ ఆలయంలో ఆదివారం వారాల పండుగ ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆలయానికి విచ్చేసి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలను చల్లగా చూడాలని ఆకాంక్షించారు. వేద పండితులు ప్రతాప్‌కు ఆశీర్వచనాలు అందించారు. వారాల పండుగ కార్యక్రమంలో ఎమ్మార్ అప్పారావు కాలనీతో పాటు పట్టణంలోని భక్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మస్తాన్, రాయవరపు ప్రసాద్, సుంద్రు నాగేంద్రరావు, పల్లె రవీంద్రరెడ్డి, యాదాల జై బాబు తదితరులు పాల్గొన్నారు.

3న ఘాట్ రోడ్డు పనులకు శంకుస్థాపన

ఆగిరిపల్లి : శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నృసింహస్వామి ఆలయ ఘాట్ రోడ్డు నిర్మాణ పనులకు అక్టోబర్ మూడో తేదీన శంకుస్థాపన చేయనున్నారు. మంత్రి కొలుసు పార్థసారథి, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ పాల్గొననున్నారు. స్వామి వారి ఆలయం నుంచి కొండపై ఉన్న మల్లేశ్వర స్వామి ఆలయం వరకు రెండు కిలో మీటర్ల వరకు ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. పిచ్చి మొక్కలు, ముళ్ల కంచెలు, రూట్ మ్యాప్‌నకు సంబంధించి అడ్డుగా ఉన్న రాళ్లను జేసీబీ సహాయంతో తొలగిస్తున్నారు. శంకుస్థాపన ఏర్పాటు పనులను ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్‌బాబు పర్యవేక్షించారు.

నేడు 'మీకోసం'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీఓ వై.భవానీ శంకరి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందించవచ్చన్నారు. వాటిని పేర్కొన్న గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు.

దూకుడు తగ్గించుకోవాలి

- ఎమ్మెల్యే కొలికపూడికి తలంటిన అధిష్టానం
- నేతలతో సయోధ్యకు ఎమ్మెల్యే యత్నాలు
- నియోజకవర్గ నేతలతో సమావేశానికి నిర్ణయం

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో వారం రోజులుగా జరుగుతున్న రగడకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు అధిష్టానం చర్యలు చేపట్టింది. పార్టీకి నష్టం కలిగించే చర్యలకు దిగుతున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు తలంటి దూకుడు తగ్గించుకోవాలని, నాయకులను కలుపుకొని పోవాలని పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆదేశించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తిరువూరు మండలంలోని చిట్టేల సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావును ఎమ్మెల్యే బహిరంగంగా దూషించడమే కాక గుడ్డలూడదీసి కొడతానంటూ అసభ్య పదజాలంతో తిట్టడంతో నియోజకవర్గంలోని టీడీపీ వర్గాలు నిరసనలకు దిగాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును సైతం నాయకులు కలిసి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు.

నేడు నియోజకవర్గ నేతలతో సమావేశం

ఇంతవరకు నియోజకవర్గంలోని సీనియర్ల ముఖం సైతం చూడని ఎమ్మెల్యే శ్రీనివాసరావు వైఖరిని అధిష్టానం తీవ్రంగా పరిగణించింది. 'తిరువూరును రక్షించండి' నినాదంతో సోమవారం సాయంత్రం పట్టణంలో పాదయాత్ర చేపడుతున్నట్లు ప్రకటించిన ఎమ్మెల్యే, అధిష్టానం ఆదేశాలతో విరమించుకున్నారు. దీనికి తోడు ఫేస్‌బుక్ వేదికగా 'అగ్నిపర్వతం బద్దలయ్యే ముందు భయంకరమైన ప్రశాంతంగా ఉంటుంది' అంటూ ఎమ్మెల్యే పోస్టింగ్ పెట్టడంతో టీడీపీ నాయకులు మరింత ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు కూడా ఎమ్మెల్యే తీరును తప్పుబట్టడం, విలేకరులను ఎమ్మెల్యే అసభ్య పదజాలంతో దూషించడం తదితర ఘటనలతో పార్టీకి, ప్రజలకు ఎమ్మెల్యే దూరమవుతున్నారని గ్రహించిన అధిష్టానం వెంటనే నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించింది.

ఇన్‌చార్జి నియామకంపై ప్రచారం

తిరువూరు నియోజకవర్గానికి ఇన్‌చార్జిని అధిష్టానం నియమిస్తోందంటూ పార్టీ వర్గాలు ఆదివారం విస్తృత ప్రచారం చేశాయి. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు తిరువూరు నియోజకవర్గ పరిశీలకుడిగా బాధ్యత అప్పగిస్తున్నారని, విజయవాడలోని మరొక సీనియర్ నేతకు తిరువూరు పార్టీ పగ్గాలు అప్పజెబుతున్నారని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడంతో క్యాడర్ గందరగోళానికి గురైంది. రెండు రోజుల్లో ఈ విషయంపై స్పష్టత వస్తుందని సీనియర్లు భావిస్తున్నారు.

జి. కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో
దొంగల హల్‌చల్

- ద్విచక్ర వాహనంపై ఇద్దరు వచ్చి చోరీలకు యత్నం
- భయాందోళనలో ప్రజలు

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గంలో ఇద్దరు దొంగలు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ రెండు రోజులుగా చోరీలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో శని, ఆదివారాల్లో జరిగిన రెండు చోరీ ఘటనలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇద్దరు వ్యక్తులు ప్రమాదంలో ఉన్నట్లు నమ్మించి సాయం చేయడానికి వచ్చిన వ్యక్తి నుంచి ఫోన్‌ను ఎత్తుకెళ్లిన ఘటన జి.కొండూరు మండల పరిధి చెవుటూరు వద్ద శనివారం జరిగింది. వివరాలలోకి వెళ్తే.. జి.కొండూరు మండల పరిధి వెంకటాపురం గ్రామానికి చెందిన దొంతిరెడ్డి పాపిరెడ్డి తన ద్విచక్ర వాహనంపై శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో జి.కొండూరు బయలుదేరాడు. చెవుటూరు గ్రామ శివారులోకి రాగానే రహదారిపై ద్విచక్ర వాహనంపై నుంచి ఇద్దరు వ్యక్తులు కింద పడిపోయినట్లు నటించారు. ప్రమాదం జరిగిందని భావించిన పాపిరెడ్డి వారికి సాయం చేసేందుకు దగ్గరికి వెళ్లి బైకును లేపాడు. ఈ క్రమంలో పాపిరెడ్డి జేబు నుంచి సెల్‌ఫోన్‌ను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత తన ఫోన్ పోయినట్లు గమనించిన పాపిరెడ్డి జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత ఆ ఇద్దరు దొంగలు పాపిరెడ్డి ఫోన్‌లోని ఫోన్‌పే యాప్ నుంచి సీక్రెట్ కోడ్‌ను కనిపెట్టి రూ.17 వేలు డ్రా చేసినట్లు పాపిరెడ్డి తెలిపారు. అదేవిధంగా రెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం గ్రామశివారులో రోడ్డు పక్కన నివాసం ఉంటున్న గుడిబండ నర్సమ్మ మెడలో బంగారు తాడు దొంగిలించేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించారు. మహిళ కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఆ తర్వాత గ్రామంలో మరో చోటు ద్విచక్ర వాహనాన్ని దొంగిలించేందుకు ప్రయత్నించి విఫలమైనట్లు స్థానికులు చెబుతున్నారు. చెవుటూరులో శనివారం జరిగిన చోరీ ఘటన, రెడ్డిగూడెంలో ఆదివారం జరిగిన చోరీ ఘటనలలో నిందితులు కూడా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులే కావడంతో పోలీసులు దొంగలను పట్టుకునే పనిలో పడ్డారు.

నష్టపోయిన ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



కవులూరులో రైతులు, అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు: బుడమేరు వరదకు పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చూస్తానని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. కవులూరు గ్రామంలో వరిపైరు నష్ట గణనలో అవకతవకలు జరిగాయని కొన్ని రోజులుగా రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని రైతులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా వ్యవసాయాధికారి నాగమణెమ్మ, పలువురు ఏడీఏలు కలిసి దీనిపై విచారణ చేసేందుకు ఆదివారం కవులూరు గ్రామం వచ్చారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సైతం ఆదివారం కవులూరు రైతులతో సమావేశమయ్యారు. రైతులు తమకు పరిహారం సక్రమంగా అందలేదని, నష్ట గణనలో తమ భూములను సక్రమంగా జాబితాలో చేర్చలేదని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు రీ ఎన్యూమరేషన్ చేసి నష్టపోయిన ప్రతి ఎకరాన్ని జాబితాలో చేర్చుతారని చెప్పారు. రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని, రీ ఎన్యూమరేషన్ పూర్తయిన తర్వాత బాధితులకు పరిహారం అందేలా చూస్తానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. రైతులు, వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయం శుద్ధి

ఇబ్రహీంపట్నం: గుడి, బడి కార్యక్రమంలో భాగంగా వేణుగోపాల స్వామి ఆలయ శుద్ధి ఆదివారం నిర్వహించారు. వడ్డిపర్తి పద్మాకర్ ఆధ్వర్యంలో ప్రణవ పీఠం శిష్య బృందం సభ్యులు, స్థానికులు ఆలయాన్ని శుభ్రం చేశారు. గుడి గోపురంతో పాటు ఆలయం లోపలి భాగాలను నీటితో కడిగి పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఎన్నో జన్మల పుణ్యఫలం ఉంటేనే ఆలయాన్ని శుభ్రం చేసే భాగ్యం కలుగుతుందని పద్మాకర్ తెలిపారు. ఆలయ శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆశీస్సులు అందజేశారు.

రేపు చెకుముకి టాలెంట్ టెస్ట్

ఇబ్రహీంపట్నం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ స్థానిక జాకీర్ హుస్సేన్ కళాశాలలో మంగళవారం నిర్వహిస్తామని జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీ మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న పాఠశాల స్థాయి పరీక్షల్లో 1,400 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ప్రథమ స్థానాల్లో నిలిచిన 8, 9, 10 తరగతులకు చెందిన 150 మంది మండల స్థాయి పరీక్షకు హాజరు కావాలన్నారు. ఈ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు.

చినుకు పడితే నరకమే

- గుంతలమయంగా ప్రధాన రహదారి
- రాకపోకలకు వాహన చోదకుల ఇబ్బందులు



మునగపాడు గ్రామ శివారులో రహదారిపై ఏర్పడిన గుంతలలో చేరిన నీరు

జి.కొండూరు: జి.కొండూరు నుంచి గంగినేని వరకు పదిహేను కిలో మీటర్ల మేర ఉన్న ప్రధాన రహదారి అడుగడుగునా గుంతలతో ప్రయాణికులకు పట్టపగలే చుక్కలు చూపిస్తోంది. ఈ రహదారి విజయవాడ వైపు నుంచి జి.కొండూరు మీదుగా ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం, మధిర, ఖమ్మం వరకు ప్రధాన రహదారిగా ఉండటంతో గతంలో నిత్యం రద్దీగా ఉండేది. రహదారి వంద శాతం ధ్వంసమవడంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. ఈ రహదారిని ఆనుకొని ఉన్న జి.కొండూరు, గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు గ్రామాల ప్రజలకు మాత్రం నిత్యం అవస్థలు తప్పడంలేదు. కొదిపాటి వర్షం పడినా గుంతలలో నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గుంతలలో నీరు ఉండడంతో రాత్రి సమయాలలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక వర్షం లేని సమయంలో ఎండ తీవ్రతకు భారీ వాహనాలు రాకపోకలు సాగించినప్పుడు తీవ్ర స్థాయిలో దుమ్ములేచి రహదారిని ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పట్టభద్రులుగా ఓటు నమోదు చేసుకోండి

ఇబ్రహీంపట్నం: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఓటరుగా నమోదు చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. త్వరలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల శాసన మండలి స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఈనెల 30 నుంచి అక్టోబర్ 6వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో ఫారం 18 పూర్తి చేసి సంబంధిత సర్టిఫికెట్లు జతచేసి నేరుగా తహసీల్దార్ కార్యాలయాల్లో అందించి ఓటు నమోదు చేసుకోవాలన్నారు.

వినాయకుడి ఊరేగింపులో రెచ్చగొట్టే వ్యాఖ్యలు

- హిజ్రాలతో డ్యాన్సులు చేయించిన నిర్వాహకులు
- డీజేలో పవన్ కల్యాణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలను ప్లే చేస్తూ కవ్వింపు చర్యలు
- డ్యాన్సులు, డీజేలను నిలిపివేయించిన పోలీసులు

సాక్షి, విజయవాడ: జి.కొండూరులో ఆదివారం రాత్రి వినాయకుడి ఊరేగింపులో టీడీపీకి చెందిన నాయకులు, యువకులు చేసిన వికృత చేష్టలు గ్రామస్తులను విస్మయానికి గురిచేశాయి. భక్తిశ్రద్ధలతో నిర్వహించాల్సిన వినాయకుడి ఊరేగింపు కార్యక్రమంలో హిజ్రాలతో రికార్డు డ్యాన్సులు చేయిస్తూ టీడీపీకి చెందిన యువకులు చేసిన చేష్టలు విసుగెత్తించాయి. అంతటితో ఆగకుండా డీజేలో పవన్ కల్యాణ్ వైఎస్సార్ సీపీ నాయకులపై గతంలో చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్లే చేస్తూ ఈలలు వేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీనితో వివాదం ముదిరి గొడవకు దారితీసే పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న నందిగామ ఏసీపీ రవికిరణ్ మైలవరం, జి.కొండూరు పోలీసులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని హిజ్రాలను అక్కడి నుంచి పంపించివేశారు. డీజేలను సైతం ఆపేశారు. ఎటువంటి హడావిడి లేకుండా ఊరేగింపు జరుపుకోవాలని, లేదంటే పూర్తిగా నిలిపివేయాలని హెచ్చరించడంతో చేసేది లేక సాధారణంగా ఊరేగింపును కొనసాగించారు.

గత శనివారం రాత్రి సైతం వినాయకుడి ఊరేగింపులో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కుక్కల వర్మ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావుతో వివాదం పెట్టుకోవడంతో అతనిపై కేసు నమోదు చేశారు.

విజయభారతి మృతికి సంతాపం

ఇబ్రహీంపట్నం: ప్రముఖ రచయిత, అంబేడ్కర్ వాది దివంగత బొజ్జా తారకం సతీమణి విజయభారతి మృతి బాధాకరమని ఎన్టీటీపీఎస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆమె మృతి చెందారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు అకాడమిని పునఃప్రతిష్ఠ చేసిన ఆమె అనేక తెలుగు గ్రంథాలు, పురాణాలు తెలుగు జాతికి అందించారని కొనియాడారు. కారంచేడు ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన వీరవనిత అన్నారు. అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా రంగనాథ్

గంపలగూడెం: పీఆర్టీయూ మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. తోటమూలలో నిర్వహించిన మండల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా నేరళ్ల రంగనాథ్, ప్రధాన కార్యదర్శిగా జిడుగు నరేష్ ఎన్నికయ్యారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా మేరుగు జయశీలన్‌రావు, అట్లూరి సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు.